# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా సంపత్

వచ్చే నెల 5న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

గంభీరావుపేట, ఆగస్టు 27: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తాడూరి సంపత్ కుమార్ జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన జాబితాలో ఆయన ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపిక కాగా అందులో సంపత్ కుమార్‌కు చోటు దక్కింది. సంపత్‌కుమార్ సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం రోజు ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు స్వీకరించనున్నారు. దమ్మన్నపేటలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా బోధిస్తున్న సంపత్‌కుమార్ పాఠశాల విద్యార్థులతో 3 జాతీయ స్థాయి, 10 రాష్ట్ర స్థాయి ఆయా సైన్సు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేసింది. పాఠశాల ఉపాధ్యాయుడు జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు, తోటి ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



తాడూరి సంపత్ కుమార్

### విజయం సాధించారు

ఎదుర్కొనే దమ్ములేకే కేంద్రం కేసీఆర్ కుటుంసభ్యులపై కేసులు బనాయించింది. ఏ ఆధారాలూ లేకుండా ఎమ్మెల్సీ కవితను 165 రోజులు జైల్లో ఉంచింది. ఆలస్యం జరిగినా నిజం, న్యాయం గెలిచింది. ఎమ్మెల్సీ కవిత జైలు నుంచి కడిగిన ముత్యంలా బయటికి వచ్చారు. బెయిల్ సాధించి కవిత విజయం సాధించారు. కోర్టుల మీద అవగాహన లేని బండి సంజయ్ సుప్రీం కోర్టు తీర్పును తప్పు పట్టడం సిగ్గు చేటు.

**- జగిత్యాలలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత**



జగిత్యాల: తహసీల్ చౌరస్తా వద్ద నినదిస్తున్న జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత, నాయకులు



కరీంనగర్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు, సీపీఐ నాయకులు

## షరతుల్లేకుండా రుణమాఫీ చేయండి

కరీంనగర్ తెలంగాణచౌక్, ఆగస్టు 27 : ఎలాంటి షరతులూ లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. అందులో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఎన్నికల ముందు ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని ఆయన స్పష్టం చేశారు. ప్రతి రైతుకు రేషన్ కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి ఎనిమిది నెలలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు.



కరీంనగర్ డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట సీటూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ఆశలు

## 'ఆశ'ల సమస్యలు పరిష్కరించండి

కరీంనగర్ విద్యానగర్, ఆగస్టు 27 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు కరీంనగర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ఎదుట మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 వరకు నిరవధిక ధర్నాకు దిగారు. డీఎంహెచ్‌వో స్పందించి ధర్నా వద్దకు వచ్చి అడల్ట్ బీసీజీ సర్వే విషయంలో కమిషనర్‌కు తెలియజేస్తానని, ఒత్తిడి చేయవద్దని జిల్లా టీబీ అధికారులతో మాట్లాడుతానని మౌఖిక హామీ ఇచ్చారు. పెండింగ్ బిల్లులు పై నుంచి వస్తే ఇస్తామని, లేకుంటే తాను చేసేదేమీ లేదని స్పష్టం చేశారు. దీంతో ఆశా కార్యకర్తలు బీసీజీ సర్వే చేసేది లేదని, పెండింగ్ బిల్లులు వచ్చేవరకు పోరాటం విరమించేది లేదని స్పష్టం చేశారు. వీరికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, ఉపాధ్యక్షుడు గుడికందుల సత్యం మద్దతు ప్రకటించి, ఆశ కార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# న్యాయమే గెలిచింది

- ఎమ్మెల్సీ కవితకు బెయిల్‌పై బీఆర్ఎస్ శ్రేణుల్లో హర్షం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సంబురాలు

జగిత్యాల, ఆగస్టు 27 : బీఆర్ఎస్ దళం ఆనందపడుతున్నది. రాజకీయ దురుద్దేశంతో మద్యం కేసులో అన్యాయంగా ఇరికించి, అరెస్టయిన ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై హర్షిస్తున్నది. రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఎదుర్కొనలేక, బీజేపీ దొంగచాటుగా దెబ్బతీయాలని చేసిన కుట్ర పటాపంచలైందని, న్యాయమే గెలిచిందని పేర్కొన్నది. ఈ మేరకు మంగళవారం అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబురాల్లో మునిగితేలారు. జగిత్యాలతో పాటు అంతటా స్వీట్లు పంచి, పటాకులు కాల్చి వేడుకలు జరుపుకున్నారు.

### న్యాయస్థానాలపై నమ్మకం పెరిగింది

ఏ ఆధారాలు చూపకుండా అక్రమంగా, రాజకీయ కక్షతో ఉద్యమ నాయకురాలు కల్వకుంట్ల కవితను 165 రోజులు జైల్లో పెడితే, ఆఖరికి న్యాయమే గెలిచింది. న్యాయస్థానాలపై నమ్మకం పెరిగింది. సుప్రీంకోర్టు న్యాయవాదులకు, తమ నాయకురాలు తరపున వాదించిన లాయర్లకు ప్రత్యేక ధన్యవాదాలు. రాజకీయాల్లో ఇలాంటి కక్షపూరిత కేసులు పెట్టి ప్రతిపక్షాలను బెదిరించడం సిగ్గుమాలిన చర్య. ప్రజలు ఇలాంటి వాటిని హర్షించరనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.



**- ఒక ప్రకటనలో బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు**



మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు స్వీటు తినిపిస్తున్న రఘువీర్‌సింగ్

## న్యాయానిదే అంతిమ విజయం

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, ఆగస్టు 27: రాజకీయ దురుద్దేశంతో ఎమ్మెల్సీ కవితను మద్యం కేసులో అన్యాయంగా ఇరికించి, అరెస్ట్ చేసినా అంతిమ విజయం న్యాయానికే దక్కిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంపిణీ చేసి, పటాకులు కాల్చారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత బెయిల్‌పై విడుదల కావడం చాలా సంతోషంగా ఉందని, కవిత కడిగిన ముత్యంలా బయటకు వస్తున్నదని చెప్పారు. సంబురాల్లో జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు, మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి గారు, కోరుకంటి చందర్ పాల్గొన్నారు.



గంగాధర మండలం బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యేకు స్వీటు తినిపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### బెయిల్ రావడం సంతోషం

రాజకీయ కుట్రలు చేసి ఉద్యమ నాయకురాలు కల్వకుంట్ల కవితను అక్రమంగా జైల్లో ఉంచారు. ఎన్ని అవాంతరాలు సృష్టించినా చివరికి న్యాయమే గెలిచింది. మన దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఎమ్మెల్సీ కవిత కడిగిన ముత్యంలా బయటికి వచ్చారు. చాలా సంతోషం.

**- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

# పేకాట.. కొత్త రూటు!



- జూదరులకు కలిసొచ్చిన నగదు రహిత లావాదేవీలు
- చేతిలో రూపాయి లేకున్నా యథేచ్ఛగా ఆట
- పోలీసులకు చిక్కకుండా ఫోన్ల నుంచే మనీ ట్రాన్స్‌ఫర్
- దాడులు చేసినా దొరక్కుండా సేఫ్
- ఇటీవలి కాలంలో మళ్లీ వెలుస్తున్న స్థావరాలు
- జగిత్యాలలో జోరుగా శిబిరాలు!
- నగదు లేకుండా ఆడుతుండడంతో పట్టుకోలేని పరిస్థితులు

**జీవితాలను ఛిద్రం చేస్తూ, బతుకులను అంధకారంలో పడేసే పేకాట రూపుమారింది. పెరిగిన సాంకేతిక నైపుణ్యంతో దేశమంతా నగదు రహిత లావాదేవీల్లోకి వెళ్లిపోతుండగా, 'శత కోటి దరిద్రాలకు, అనంత కోటి ఉపాయాలన్నట్టు' ఈ మార్పు పేకాటరాయుళ్లకు అవకాశంగా మారింది. గతంలో ఈ జూదం ఆడుతున్న సమయంలో దాడులు చేస్తే నగదు దొరికినా, ఇప్పుడు జేబులో రూపాయి లేకుండా ఈ ఆట జోరుగా సాగుతున్నది. మొబైల్ ఫోన్ల నుంచే పెద్ద మొత్తంలో మనీ ట్రాన్స్‌ఫర్ జరుగుతున్నది. కేసీఆర్ పాలనలో ఉక్కుపాదం మోపడంతో మూతపడ్డ శిబిరాలన్నీ మళ్లీ పుట్టుకొస్తుండగా, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పట్టణాల్లో విచ్చలవిడిగా స్థావరాలు సాగుతున్నట్టు తెలుస్తున్నది.**

జగిత్యాల, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ సర్కారు జూదంపై నిషేధం ప్రకటించింది. పేకాటతో అనేక కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని భావించి ఉక్కుపాదం మోపింది. అందులో భాగంగా పేకాట శిబిరాలపై పోలీస్‌శాఖ దాడులు చేయడంతో చాలా చోట్ల మూతపడ్డాయి. పేకాట కోసం వెలిసిన రిక్రియేషన్ క్లబ్బులు సైతం కనుమరుగయ్యాయి. క్లబ్బులు సైతం బెదిరిపోయాయి. అయితే పెద్దనోట్ల రద్దు తర్వాత అన్ని రంగాల్లో ఆర్థిక లావాదేవీలు మందగిస్తే, పేకాట మాత్రం విపరీతంగా పెరిగిపోయింది. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం, ఆన్‌లైన్ పేమెంట్స్‌పై విస్తృతంగా అవగాహన కల్పించడంతో చాలా మందికి స్వైప్ మిషన్, మొబైల్, యాప్స్ ద్వారా మనీ ట్రాన్స్‌ఫర్‌పై పట్టు చిక్కింది. ఈ క్రమంలోనే పేకాట నిషేధం నేపథ్యంలో తీవ్రంగా ఇబ్బందులు పడ్డ జూదరులు నగదు రహిత లావాదేవీలను వినియోగించుకుని ఆడే ప్రక్రియను కొనసాగించడం మొదలైంది.

### అంతా నగదు రహితమే!

జిల్లాలో నగదు రహిత జూదం విచ్చలవిడిగా సాగుతున్నది. పలువురు రాజకీయ నాయకులు, వైద్యులు, అధికారులు, టీచర్లు, పోలీసులు ఈ జూదం ఆడుతున్నట్టు తెలుస్తున్నది. అయితే ఈ ఆటను నిర్వహించే వారందరూ పెద్ద ధనవంతులేననే ఆరోపణలున్నాయి. కాగా, గతంలో మండల స్థాయిలో కీలక బాధ్యతలు పోషించిన ఓ వ్యక్తి పెద్ద పేకాట శిబిరం నిర్వహించేవాడన్న విషయం బహిరంగ రహస్యమే. జూదం నిర్వాహకులంతా కరెంట్ బ్యాంక్ అకౌంట్లను కలిగి ఉన్నవారే. కొందరు ఈ అకౌంట్ల ఆధారంగా స్వైప్‌మిషన్లతో చెల్లింపులు చేస్తే.. మరికొందరు సెల్‌ఫోన్లలో యాప్స్ ద్వారా నగదును బదిలీ చేస్తున్నట్టు తెలుస్తున్నది. అయితే జేబులో ఒక్క రూపాయి లేకున్నా చేతిలో సెల్‌ఫోన్లు పట్టుకొని పేకాడుతుండగా, పెద్ద మొత్తంలోనే డబ్బులు ట్రాన్స్‌ఫర్ జరుగుతున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే పట్టణంలో పలు ఇండ్లల్లో నగదు రహిత పేకాట స్థావరాలు ప్రారంభమైనట్లు సమాచారం కాగా, గతంలో పేకాట స్థావరాలను నిర్వహించిన వారే సాంకేతిక నైపుణ్యాన్ని వంటబట్టించుకొని ఈ శిబిరాలను నడుపుతున్నట్టు తెలుస్తున్నది.

### సులువుగా ఆట

జూదరులకు నగదు రహిత ఆట కలిసి వచ్చింది. గతంలో జూదం ఆడేందుకు పెద్ద తతంగమే ఉండేది. జూదం నిర్వహించే స్థలం, రక్షణ మార్గాలు, ఆడే వారికి చాయ్ నుంచి మొదలు కొని మందు వరకు ఏర్పాట్లు తదితర వ్యవహారం సాగేది. దీంతో నిర్వాహకులు, జూదరులు పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకొని పేకాట స్థావరాలకు వెళ్లేవారు. ఆయా ప్రాంతాల్లో పదుల సంఖ్యలో జూదరులు, బైకులు, కార్లు నిలిచి ఉండేవి. ఒకరకంగా పేకాట స్థావరాల వద్ద పెద్ద కోలాహలమే ఉండేది. పోలీసులు దాడి చేసే సందర్భంలో అందరి వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు పట్టుపడేవి. బైకులు, కార్లు ఉండడంతో విధిలేని పరిస్థితుల్లో జూదరులు దొరికిపోయేవారు. ఇక పేకాడే వారి వద్ద డబ్బులు పట్టుబడడంతో పోలీసులు కచ్చితంగా కేసులు నమోదు చేసే వారు. అయితే ఇప్పుడు నగదు రహిత వ్యవహారం నేపథ్యంలో జూదం ఆడే వారి వద్ద ఒక్క రూపాయి కూడా దొరకడం లేదు. గతం కంటే సేఫ్‌గా పేకాడుకునేందుకు అవకాశాలు ఏర్పడ్డాయని, ఎవరితోను ఇబ్బందులు లేవని, కేసులయ్యే అవకాశాలు తగ్గిపోయాయని జూదరులు అంటున్నారు. క్రెడిట్ కార్డు ఉంటే చాలు పేకాటకు లైసెన్స్ దొరికినట్లేనని చెబుతున్నారు. నగదు రహిత లావాదేవీల వ్యవహారానికి ప్రాధాన్యత పెరగడం, సాంకేతిక నైపుణ్యం ఇలా ఉపయోగపడడంతో పేకాటరాయుళ్లకు అడ్డు లేకుండా పోయింది.

### మళ్లీ పుంజుకుంటున్న జూదకేంద్రాలు?

కేసీఆర్ సర్కార్ మారడంతో మళ్లీ పేకాట స్థావరాల జోరు పెరిగినట్టు తెలుస్తున్నది. ఇటీవలి కాలంలో పోలీసులు పట్టుకున్నట్లు చేస్తున్న ప్రకటనలే అందుకు ఉదాహరణ. తాజాగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఒక ఇంట్లో జూదం ఆడుతున్న వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించిన పోలీసులకు జగిత్యాల పట్టణంలోని కొన్ని ఇండ్లు ఇప్పటికే పేకాట కోసం అద్దెకు తీసుకొని శిబిరాలు నిర్వహిస్తున్నారనే విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. సాధారణ గృహాల మధ్య ఉన్న ఇండ్లలో ఎవరికి అనుమానం రాకుండా స్థావరాలను నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. ఇక కరీంనగర్-జగిత్యాల జిల్లాల మధ్య ఉన్న ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఒక మండలంలో అటవీ ప్రాంతం అధికంగా ఉంది. ఇక్కడ గతంలో నిత్యం పెద్ద పెద్ద పేకాట స్థావరాలు నడిచేవి. అయితే నిఘా పెరిగిన నేపథ్యంలో పేకాట శిబిరాలు చాలా మట్టుకుతగ్గిపోయాయి. అయితే రూటు మార్చిన కొందరు నిర్వాహకులు అటవీ లోపలి ప్రాంతంలోకి స్థావరాలను తరలించి, చిన్నచిన్నగా శిబిరాలను ఏర్పాటు చేసి, దందాను కొనసాగిస్తున్నట్లు సమాచారం. కోరుట్ల నుంచి చందుర్తి వెళ్లే ప్రాంతంలోను పేకాట స్థావరాలు ఉన్నట్లుగా తెలిసింది. రాయికల్ మండలంలోని అటవీ ప్రాంతంలోని మామిడి తోటల్లోను పేకాట కొనసాగుతున్నట్లుగా సమాచారం. నగదు రహిత పేకాటపై కొందరు అధికారులు మాట్లాడుతూ, అలాంటి వాటిని ఏం చేయలేమని, పేర్కొంటుండడం గమనార్హం. ఏది ఏమైనా పెరిగిన సాంకేతిక నైపుణ్యత జనావళికి మంచి చేయాలి గానీ, ఇలా తప్పుడు చర్యలకు సైతం ఊతంగా నిలుస్తుండడంపై పలువురు మండిపడుతున్నారు.



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు

## జీపీ కార్మికుల జీతాలు చెల్లించండి

కరీంనగర్ తెలంగాణచౌక్, ఆగస్టు 27 : గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ జీతాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆరు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జీతాలు లేకపోవడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. పని గంటలకు మించి పనిచేయాలని అధికారులు వేధింపులకు పాల్పడుతున్నారని, ప్రతి కార్మికుడికి రెండు జతల బట్టలు ఇవ్వాల్సి ఉన్నా ఇవ్వడం లేదని, కార్మికులకు ఇన్సూరెన్స్ డబ్బులను గ్రామపంచాయతీ నిధుల నుంచి చెల్లించాలని ఉన్నా తమ వేతనాలను నుంచి చెల్లిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.



కరీంనగర్ డిపో-1 ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న రీజియన్ జేఏసీ నాయకులు

## ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందే

ఆర్టీసీ జేఏసీ నాయకుల డిమాండ్ • డిపోల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన

కరీంనగర్ తెలంగాణచౌక్, ఆగస్టు 27 : ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను చేయాల్సిందేనని ఆర్టీసీ జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వోద్యోగులుగా గుర్తిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు విస్మరించిందని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని డిపోల ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు విలీన ప్రక్రియ గురించి మాట్లాడక పోవడం శోచనీయమని ఆవేదన చెందారు. మహాలక్ష్మి పథకంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులు లేక పోవడంతో ఉన్న బస్సులను అదనంగా తిప్పుతున్నారని, డ్రైవర్లు, కండక్టర్లతో ఎనిమిది గంటలకు మించి డ్యూటీలను చేయిస్తున్నారని తెలిపారు. సిబ్బందిపై అధికారలు వేధింపులు మానుకోవాలని డిమాండ్ చేశారు.

## వసతి గృహాలను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి

- విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడండి
- కలెక్టర్ పమేలా సత్పతి



బీసీ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన వంటకాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

చొప్పదండి, ఆగస్టు 27: బీసీ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం చొప్పదండి పట్టణంలోని బీసీ సోషల్ వెల్ఫేర్ వసతి గృహాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో గదులను పరిశీలించారు. విద్యార్థులు ఎంతమంది ఉన్నారు? విద్యా బోధన, హాస్టల్ పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలు, తదితర అంశాలను అధికారులు, సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వంటగదిలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన వంటకాలను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు, ఓపీ తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించాలని సూచించారు. మంగళవారం జరిగిన ఆరోగ్య మహిళ క్లినిక్‌ను పరిశీలించి మహిళలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సరస్వతి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, వైద్యాధికారులు, సూపర్‌వైజర్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆవులకు చికిత్స చేస్తున్న పశు వైద్యులు

## లారీలో కుక్కి.. అడ్డంగా చిక్కి

- ఆదిలాబాద్ నుంచి అక్రమంగా గోవుల తరలింపు
- ఎల్ఎండీలో పట్టుకున్న పోలీసులు
- నాలుగు ఆవుల మృత్యువాత

తిమ్మాపూర్, ఆగస్టు 27: లారీలో కుక్కి అక్రమంగా 48 గోవులను తరలిస్తున్న నిందితులు ఎల్ఎండీ పోలీసులకు అడ్డంగా చిక్కారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా నుంచి 48ఆవులను ట్రక్కులో హైదరాబాద్ వైపు తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో ఎల్ఎండీ పోలీసులు తిమ్మాపూర్ సమీపంలో పట్టుకున్నారు. లారీలో గోవులు ఒకదానిపై ఒకటి పడి దీన స్థితిలో ఉండడంతో పోలీసులు వెంటనే ఎల్ఎండీలోని గోశాలకు తరలించారు. 48ఆవుల్లో ఊపిరాడక 4ఆవులు చనిపోయాయి. పశువైద్యులు చేరుకుని అపస్మారక స్థితిలో, అవస్థకు గురైన ఆవులకు చికిత్సనందించారు. ట్రక్కును స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను ఎల్ఎండీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎవరు తరలిస్తున్నారు..? ఎక్కడికి తరలిస్తున్నారనే విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పశువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చేరాలు హెచ్చరించారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571